సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 16 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.35 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 529 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.13
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7 పలికినట్లు అధికారులు తెలిపారు.



జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఉదయం పూట కొన్ని ప్రాంతాల్లో చలి వాతావరణం కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- తొలి రోజు 779 మంది గైర్హాజరు



కొత్తచెరువు జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్ కుమార్

ప్రశాంతి నిలయం: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 99 కేంద్రాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు రాశారు. జనరల్ పరీక్షలకు 26,777 మందికి గాను 26,127 మంది మాత్రమే హాజరయ్యారు. 650 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌కు సంబంధించి 2,549 మందికి గాను 2,420 మంది మాత్రమే హాజరయ్యారు. 127 మంది గైర్హాజరయ్యారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శివ సాయి జూనియర్ కళాశాలల్లోని ఇంటర్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ బసంత్ కుమార్ తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఏర్పాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

హాజరులేకున్నా పరీక్షలకు అనుమతి

ఇంటర్ విద్యార్థులకు హాజరుతో పని లేకుండా ప్రతి విద్యార్థినీ ఇంటర్ పబ్లిక్ పరీక్షలను అనుమతించాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎం.వి శేషగిరిరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థుల నుంచి అందిన వినతులు మేరకు 2022–23 సంవత్సరానికి మాత్రమే ఈ వెసులు బాటు కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హాజరు తక్కువగా ఉన్నప్పటికీ విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడు చేసుకుని చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్ ద్వారా పరీక్షకు హాజరు కావచ్చని సూచించారు.

18 నుంచి జిల్లాలో 'యువగళం'

- రూట్ మ్యాప్ పరిశీలించిన ఎస్పీ

తనకల్లు: టీడీపీ నాయకుడు నారా లోకేష్ తలపెట్టిన 'యువగళం' పాదయాత్ర ఈనెల 18న జిల్లాలోకి ప్రవేశించనుంది. ఈ నేపథ్యంలో తనకల్లు మండలంలో పాదయాత్ర జరిగే ప్రాంతాల రూట్‌మ్యాప్‌ను ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ బుధవారం పరిశీలించారు. జిల్లా సరిహద్దు ప్రాంతమైన చీకటిమానిపల్లి నుంచి తనకల్లు మండలంలో ఏయే గ్రామాల మీదుగా పాదయాత్ర జరగనుందో ఆ ప్రాంతాలను ఆయనే స్వయంగా పరిశీలించారు. ఎస్పీ వెంట కదిరి డీఎస్పీ భవ్యకిశోర్, ఎస్ఐ రాంభూపాల్ తదితరులు ఉన్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల




పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ రామకృష్ణారెడ్డి

అనంతపురం: ఎస్కే యూనివర్సిటీ డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి బుధవారం సాయంత్రం విడుదల చేశారు. మొత్తం 13,750 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 4,945 మంది పాసయ్యారన్నారు. 35.96 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఆయన వెల్లడించారు.

ముగ్గురు విద్యార్థుల డీబార్

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో బుధవారం నిర్వహించిన డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో ముగ్గురు డీబార్ అయ్యారు. ఈ మేరకు పరీక్షల విభాగం సంచాలకుడు ఆచార్య జీవీ రమణ తెలిపారు. డీబార్ అయిన వారిలో అనంతపురంలో ఇద్దరు, తాడిపత్రిలో ఒకరు ఉన్నారు.

ఛ్ఛ్.. లాభం లేదు



ఫలితానికి ముందే టీడీపీ నేతల డీలా

- తమ్ముళ్లు చెయ్యిచ్చారంటూ 'పట్టభద్రుల' అభ్యర్థి భూమిరెడ్డి ఆవేదన
- ఇన్‌చార్జ్‌లపై చంద్రబాబుకు ఫిర్యాదు
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో విజయంపై ధీమా

సాక్షి, పుట్టపర్తి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పర్వం తుది అంకానికి చేరుకుంది. ఓట్ల లెక్కింపు గురువారం ప్రారంభం కానుంది. అధికార వైఎస్సార్ సీపీ నేతలంతా ఉరకలెత్తే ఉత్సాహంతో ఉండగా... టీడీపీ నేతలు నిస్తేజంగా కనిపిస్తున్నారు. ఇప్పటికే ఓటమి భయంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేయకుండా తప్పుకున్న టీడీపీ... పట్టభద్రుల స్థానానికి కూడా ఉనికి కోసం అన్నట్లు అభ్యర్థిని బలవంతంగా పోటీలో దింపింది. దీంతో తమ్ముళ్లు కూడా ఈ ఎన్నికను తేలిగ్గా తీసుకున్నారు. నామినేషన్ నుంచి ప్రచారం, ఓటింగ్ దాకా నామమాత్రంగా నడిపించేశారు. పోలింగ్ రోజున కూడా తమ్ముళ్లు పట్టీపట్టనట్లు వ్యవహరించారు. చివరకు కౌంటింగ్‌కు వచ్చే నాయకుడే లేకపోవడంతో టీడీపీ అభ్యర్థి నానా పాట్లు పడుతున్నట్లు తెలుస్తోంది.

అధిష్టానం వద్ద అభ్యర్థి ఆవేదన

జిల్లాలో టీడీపీ నేతలు ఎవరూ తనకు సరైన సహకారం అందివ్వలేదని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పార్టీ అధిష్టానం వద్ద వాపోయినట్లు సమాచారం. ఎమ్మెల్సీ ఎన్నికల గురించి జిల్లా నేతలు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని చెప్పారట. ఈ క్రమంలో చంద్రబాబు.. జిల్లా నేతలతో ఫోన్‌లో టచ్‌లోకి కూడా వచ్చారని చెబుతున్నారు. 'తమ్ముళ్లా.. నేను చెప్పింది ఏంటి.. మీరు చేసింది ఏంది. రామగోపాల్‌రెడ్డిని గెలిపించాలని చెప్పాను కదా.. మీ తీరు బాగాలేదు' అని ఫోన్‌లో పలువురితో మాట్లాడినట్లు సొంత పార్టీ నేతలే చర్చించుకోవడం గమనార్హం.

ఓటమిని ముందే పసిగట్టి...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిని ముందే పసిగట్టిన టీడీపీ అధిష్టానం... ఉపాధ్యాయ కోటాలో రెండు (పశ్చిమ, తూర్పు రాయలసీమ) స్థానాల్లో పోటీ నుంచి తప్పుకుంది. ఫలితంగా తెలుగు తమ్ముళ్లకు అధిష్టానంపై నమ్మకం సన్నగిల్లింది. బరిలో ఉన్న స్థానాల్లో కూడా గెలుస్తామో? లేదో? అన్న సందేహంలో పడ్డారు. ఓటమి తప్పదన్నప్పుడు ఎంత చేసి ఏం లాభమని భావించి కాడి కిందపడేశారు. ఈక్రమంలోనే జిల్లా వ్యాప్తంగా టీడీపీ నేతలు ఒక్కరు కూడా టీడీపీ అభ్యర్థి కోసం గట్టిగా పోరాడిన దాఖలాలు లేవు. చివరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కూడా 'భూమిరెడ్డి'కి సరైన సహకారం అందించలేదని ఆపార్టీ వర్గాలే చెబుతున్నాయి.

ప్రచారం పక్కనపెట్టి 'యువగళం'వైపు అడుగులు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేయాల్సిన సమయంలోనూ టీడీపీ తమ్ముళ్లు పెద్దగా పట్టించుకోలేదు. పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లాలో నారా లోకేశ్ 'యువగళం' కొనసాగుతుండగా... జిల్లా టీడీపీ నేతలందరూ ఒకరి తర్వాత ఒకరు పోటీ పడి మరీ నారా లోకేశ్‌ను కలిసి వచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పక్కన బెట్టి స్వప్రయోజనాల కోసం.. నారా లోకేశ్ వద్ద మార్కులు కొట్టేందుకు ఎవరికి వారుగా అన్నమయ్య జిల్లాకు తరలివెళ్లారు. దీంతో జిల్లాలో టీడీపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం వెలవెలబోయింది.

నాగరాజుకు కలిసి రాని నంబరు

బీసీ నేతగా.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలువురితో సన్నిహిత సంబంధాలున్నప్పటికీ 'పీడీఎఫ్' అభ్యర్థి పోతుల నాగరాజుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇవేవీ కలిసి రాలేదని చెప్పవచ్చు. ఏడాది కాలంగా ప్రచారం చేసినా.. అంతంత మాత్రంగానే స్పందన కనిపించింది. దీనికి తోడు పోలింగ్ బ్యాలెట్‌లో 27వ నంబరు కావడంతో ఓటర్లు గందరగోళంలో పడినట్లు తెలుస్తోంది. పైగా తనకు రెండో ప్రాధాన్యం ఓటు వేయాలని పోతుల నాగరాజు ఎక్కువగా ప్రచారం చేసుకోవడం బెడిసికొట్టినట్లు తెలుస్తోంది. సీరియల్ నంబరులో నాగరాజు పేరు చాలా వెనుక ఉండటంతో సరైన ఫలితాలు రాకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

విజయం వైఎస్సార్‌సీపీ వైపే

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో రాష్ట్రాభివృద్ధి ప్రత్యక్షంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో దిగిన వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు ఖాయమని అధికార పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొదటి ప్రాధాన్యం ఓట్లతోనే విజయం తెలిసిపోతుందని అంచనా వేస్తున్నారు.

'ఎమ్మెల్సీ' ఓట్లు ఎలా లెక్కిస్తారంటే..

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు భిన్నంగా ఉంటుంది. అభ్యర్థి గెలవాలంటే పోలైన ఓట్లలో చెల్లని ఓట్లు తీసివేయగా.. చెల్లిన ఓట్లలో ప్రాధాన్యతా పద్ధతిలో 50 శాతంపైన ఒక ఓటు అధికంగా రావాలి. పట్టభద్ర ఎమ్మెల్సీకి 2,45,576, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 25,887 ఓట్లు పోలయ్యాయి.

- తొలుత మొదటి ప్రాధాన్యత (1) ఓట్లు ఎవరికి ఎన్ని వచ్చాయో లెక్కిస్తారు. ఈ దశలో ఎవరైనా 50 శాతంపైన ఒక ఓటు ఎక్కువ సాధిస్తే ఆ అభ్యర్థిని గెలిచినట్లు ప్రకటిస్తారు. అప్పుడు 2వ, 3వ, 4వ ప్రాధాన్యత ఓట్లు లెక్కించాల్సిన అవసరమే ఉండదు.
- మొదటి ప్రాధాన్యత (1) ఓట్లు ఎవరికీ 50 శాతం పైన ఒక ఓటు రాకపోతే... మొదటి ప్రాధాన్యత ఓట్లు అందరికంటే తక్కువ వచ్చిన అభ్యర్థిని ఎలిమినేట్ (తొలగింపు) చేస్తారు. అతని రెండవ (2) ఓటును మిగిలిన వారికి ఎవరికి ఎన్ని వచ్చాయో లెక్కించి కలుపుతారు. ఈ క్రమంలో ఎవరైనా అభ్యర్థికి 50 శాతంపైన ఒక ఓటు వస్తే గెలిచినట్లు ప్రకటిస్తారు. లేనిపక్షంలో లెక్కింపు కొనసాగిస్తారు.
- ఆ తరువాత తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని తప్పించి అతని రెండవ (2) ఓట్లను మిగిలిన వారిలో ఎవరికి ఎన్ని వచ్చాయో లెక్కించి కలుపుతారు. అప్పుడూ ఎవరికీ 50 శాతంపైన ఒక ఓటు రాకపోతే.... అప్పటికే ఎలిమినేట్ అయిన ఇద్దరి మూడవ (3) ప్రాధాన్యత ఓట్లను లెక్కించి పై వారికి కలుపుతారు.
- చెల్లిన ఓట్లలో 50 శాతంపై ఒక ఓటు వచ్చే వరకు ఆఖరు నుంచి తక్కువ ఓట్లు వచ్చిన వారి 2వ, 3వ, 4వ ఓట్లను ఒక క్రమంలో కలుపుతూ పోతారు.
- చివరిదాకా 50 శాతంపై ఒక ఓటు రాకపోతే... ఎలిమినేట్ కాని చివరి అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లు



జేఎన్‌టీయూ కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లు

- ఉదయం 8 గంటలకు ప్రారంభం
- మూడు దశలుగా లెక్కింపు ప్రక్రియ
- ఫలితాల ప్రకటనకు 3 రోజుల సమయం!

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి (ఆరు జిల్లాలు) ఓట్ల లెక్కింపు జేఎన్‌టీయూ కళాశాలలో బుధవారం ప్రారంభం కానుంది. కౌంటింగ్ సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలవుతుంది. ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఒక సుదీర్ఘమైన ప్రక్రియ. పోలైన ఓట్లలో చెల్లని ఓట్లు తీసివేయగా చెల్లిన ఓట్లలో 50శాతంపైన ఒక ఓటు ఎక్కువగా వచ్చిన అభ్యర్థిని గెలిచినట్లుగా ప్రకటిస్తారు. ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లు 2,45,576 పోలయ్యాయి. ఈ సంఖ్య ప్రకారం చూస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు ప్రకటనకు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇక ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఉపాధ్యాయుల ఓట్లు 25,887 పోలయ్యాయి. ఈ సంఖ్య ప్రకారం అభ్యర్థి గెలుపు ప్రకటనకు ఒక రోజు నుంచి ఒకటిన్నర రోజు సమయం పట్టవచ్చని అంటున్నారు.

మూడు దశల్లో లెక్కింపు

ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మూడు దశలుగా నిర్వహిస్తారు. మొదటిగా ప్రాథమిక లెక్కింపు (ఇన్షియల్ కౌంటింగ్)లో బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కడతారు. ఆ కట్టలను డ్రమ్ముల్లో వేసి కలియబెడతారు (జంబ్లింగ్). రెండవ దశలో సమగ్ర లెక్కింపు (డిటైల్డ్ కౌంటింగ్)లో మొదటి ప్రాధాన్యత ఓటు లెక్కిస్తారు. ఆ ఓట్లను కట్టలుగా కట్టి ఉంచుతారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికీ 50 శాతంపైన ఒక ఓటు అధికంగా రాకపోతే మూడవ దశ బదిలీ ఓట్ల లెక్కింపు (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఓట్స్ కౌంటింగ్) చేపడతారు.

లెక్కింపునకు బ్యాచ్‌లు

ఓట్ల లెక్కింపు ప్రక్రియ అభ్యర్థి గెలుపు ప్రకటన వరకు నిరంతరాయంగా సాగుతుంది. పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు రెండు హాళ్లు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపునకు ఒక హాలు సిద్ధం చేశారు. పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 24 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు బ్యాచ్‌లు మూడు షిఫ్ట్‌లుగా పనిచేస్తాయి. ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఇక్క రెండు బ్యాచ్‌లు రెండు షిఫ్ట్‌లుగా పనిచేస్తాయి. ఓట్ల లెక్కింపునకు ఐదు బ్యాచ్‌ల్లో 568 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ప్రక్రియలో భాగమైన ఇతర బాధ్యతలను 91 మంది అధికారులు, సిబ్బంది నిర్వర్తిస్తారు.

2017 ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్..

పట్టభద్రుల ఓట్లు	2,49,582
పోలైన ఓట్లు	1,55,536
శాతం	62.32
ఉపాధ్యాయుల ఓట్లు	20,515
పోలైన ఓట్లు	18,739
శాతం	93.84

2023 ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

పట్టభద్రుల ఓట్లు	3,30,124
పోలైన ఓట్లు	2,45,576
శాతం	74.39
ఉపాధ్యాయుల ఓట్లు	28,148
పోలైన ఓట్లు	25,887
శాతం	91.97

కట్టుదిట్టమైన బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ ఫక్కీరప్ప తెలిపారు. జేఎన్‌టీయూ కళాశాల ఆవరణలోని స్ట్రాంగ్ రూంను ఆయన పరిశీలించారు. అనంతరం కౌంటింగు హాలులో ఏర్పాట్లపై ఆరా తీశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారుల వాహనాల ఎంట్రీతో పాటు పార్కింగ్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగంతో కలసి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, పాల్గొన్నారు.

98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు శుభవార్త!

- 27 జీఓ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థులు

రాప్తాడురూరల్: డీఎస్సీ– 98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వీరికోసం బుధవారం 27 జీఓను విడుదల చేసింది. వాస్తవానికి ఈ అభ్యర్థులు న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు. ఐదుగురు ముఖ్యమంత్రులు మారారు కానీ వీరి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో చేపట్టిన పాదయాత్ర సమయంలో డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు టైం స్కేల్ ప్రకారం సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల్లో నియమించేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్‌హాక్ ప్రాతిపదికన ఉపాధ్యాయులుగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థులను నియమించేందుకు గతేడాది జూన్‌లోనే ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. డీఎస్సీ–2008 క్వాలిఫైడ్ టీచర్లతో సమానంగా మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఆధారంగా అభ్యర్థులను సెకండరీ గ్రేడ్ టీచర్లుగా (ఎస్జీటీలుగా) నియమించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన జీఓ తాజాగా విడుదల చేసింది. వీరికి వేతనం రూ.32,670గా నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,534 మందికి లబ్ధికి చేకూరనుంది. అర్హత గల అభ్యర్థులు ఉపాధ్యాయ వృత్తిలో చేరేందుకు ఆసక్తి, ఇష్టతను తెలియజేసేందుకు ఆప్షన్ తీసుకున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 576 మంది అభ్యర్థులకు గాను 540 మంది తమ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ వివరాలన్నీ జిల్లా విద్యాశాఖ ప్రభుత్వానికి పంపింది. ప్రభుత్వం తదుపరి ఆదేశాలను బట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

సీఎం జగన్ న్యాయం చేశారు

25 ఏళ్లుగా మేం పోరాటాలు చేస్తున్నా మా సమస్య పరిష్కారం కాలేదు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మాకు న్యాయం చేశారు. ఆ మహానుభావుడు చేసిన సాయానికి మా కుటుంబాలు జీవితాంతం రుణపడి ఉంటాయి.

– చల్లా రామాంజనేయులు, డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



హాజరైన సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు



మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

పుట్టపర్తి: పదో తరగతి పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ మీనాక్షి అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం బుక్కపట్నం 'డైట్' కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ.. జిల్లా ఆవిర్భావం తర్వాత తొలిసారి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ఆరు పేపర్లకే నిర్వహిస్తున్నామన్నారు. ప్రశ్నా పత్రాలపై సీరియల్ నంబర్లు ముద్రిస్తున్నామని, 24, 12 పేజీల చొప్పున బుక్‌లెట్స్ పంపిణీ చేస్తామన్నారు. కేంద్రాల్లోకి ఇన్విజిలేటర్లు గానీ, సిబ్బంది గానీ సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ తాగునీరు, ఇతర సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. సమావేశంలో 'డైట్' ప్రిన్సిపాల్ రామకృష్ణ, డీవైఈఓ రంగస్వామి, నాగరాజు పాల్గొన్నారు.



భృగుతీర్థంలో శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

వైభవంగా శ్రీవారి చక్రస్నానం

- ధ్వజావరోహణంతో ముగిసిన ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుడి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన శ్రీవారి చక్రస్నానం(తీర్థవాది) బుధవారం భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. తొలుత శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆ తర్వాత శ్రీవారి సుదర్శన చక్రానికి భృగుతీర్థంలో చక్రస్నానం చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుష్కరిణి జలంతో స్నానమాచరించారు.

చక్రస్నానంతో యజ్ఞఫలం

'బ్రహ్మోత్సవాలు నిర్వహించిన వారికి.. ఇందుకు సహకరించిన వారికి ..ఉత్సవాల్లో శ్రీవారిని దర్శించుకున్న వారికి ఇలా..అందరికీ శ్రీవారి చక్రస్నానంతో ఉత్సవ యజ్ఞఫలం లభిస్తుంది' అని అర్చక పండితులు వివరించారు. చక్రస్నానానికి ముందు స్వామి వారికి విష్వక్సేన ఆరాధన, పుణ్య హవచనం, ముఖ ప్రక్షాళన, ధూప దీప నివేద్యం, ఛత్ర, ఛామర, వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు.

ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాలకు సకల దేవతా మూర్తులను ఆహ్వానించేందుకు ఉత్సవాల ప్రారంభం నాడు అర్చకులు ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం చేసి గరుడ పతాకం ఎగురవేశారు. శ్రీవారి చక్రస్నానం అనంతరం ఆ ధ్వజపటాన్ని అవరోహనం చేశారు. దీన్నే కదిరి ప్రాంతంలో కంకణాలు విప్పడం అంటారు.

4 గంటల నుంచి ఆలయం మూత

బ్రహ్మోత్సవాల అంకురార్పణ నుంచి యాగశాలలో గడిపిన శ్రీవారు తీర్థవాది ముగించుకొని బుధవారం తిరిగి ఆలయంలోకి ప్రవేశించారు. దీంతో సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం తలుపులు మూసివేశారు. తిరిగి గురువారం(నేటి) ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పుతారు. తీర్థవాది ఉత్సవంలో ఈఓ పట్టెం గురుప్రసాద్, పాలక మండలి చైర్మన్ జెరిపిటి గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, పోలీసులుతో పాటు పాల్గొన్న భక్తులందరూ రంగులు చల్లుకొని ఆనందోత్సాహాలతో గడిపారు.



చక్రస్నానానికి పసుపు సిద్ధం చేస్తున్న మహిళలు



కొబ్బరి నీళ్లతో శ్రీవారికి స్నపనం

పాతిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం

బొమ్మనహాళ్: కుటుంబసభ్యులు ఖననం చేసిన మహిళ మృతదేహాన్ని అధికారులు వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు.. గత ఏడాది నవంబర్ 2న బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరులో 11 కేవీ విద్యుత్ తీగలు తెగి ట్రాక్టర్ ట్రాలీపై పడిన ఘటనలో నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో మహిళ బళ్లారిలోని విమ్స్‌లో చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రాణాలతో బయటపడిన సుంకమ్మ (48) కుడికాలు కోల్పోయింది. ఐదు మాసాల చికిత్స అనంతరం ఇటీవల ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న ఆమె ఇన్‌ఫెక్షన్ కారణంగా మంగళవారం వేకువజామున మృతి చెందింది. దీంతో అదే రోజు సాయంత్రం స్థానిక శ్మశాన వాటికలో ఆమె మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం బుధవారం పత్రికల్లో వెలువడింది. సమాచారం తెలుసుకున్న అధికారులు మధ్యాహ్నం దర్గాహొన్నూరు గ్రామానికి చేరుకుని సుంకమ్మ మృతిపై ఆరా తీశారు.



సుంకమ్మ మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతరం ఎస్‌ఐ శివ, తహసీల్దార్ శ్రీనివాసులు సమక్షంలో మృతురాలి భర్త బొజ్జప్ప, కుటుంబసభ్యులతో కలసి శ్మశానికి చేరుకుని పాతిపెట్టిన సుంకమ్మ మృతదేహాన్ని వెలికి తీయించి రాయదుర్గం ప్రభుత్వ వైద్యాధికారి ప్రభావతి పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించారు. విద్యుత్ ప్రమాదంలో గాయపడినట్లుగా గతంలో కేసు నమోదైన నేపథ్యంలో మృతదేహానికి పోస్టుమార్టం అనివార్యమైందని ఈ సందర్భంగా ఎస్‌ఐ శివ తెలిపారు.

బీకే బూతు పురాణం

- 'సాక్షి' పెనుకొండ విలేకరిపై నోటిదురుసు
- రాయలేని భాషలో దూషణ
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామనే అసహనం

సాక్షి, పుట్టపర్తి: టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి రెచ్చిపోయారు. 'సాక్షి' దినపత్రిక పెనుకొండ విలేకరిని అసభ్య పదజాలంతో దూషించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామనే నిరుత్సాహం, తనపై ఎలాంటి అభాండమూ రాకూడదన్న ముందుజాగ్రత్తతో ఆయన పక్కా ప్రణాళిక ప్రకారం 'సాక్షి'పై అక్కసు వెళ్లగక్కారు. పెనుకొండ విలేకరి మల్లికార్జునకు ఫోన్ చేసి.. 'నాపై కథనాలు రాసే హక్కు ఎవడిచ్చాడు? టీడీపీలో నా వ్యతిరేకులెవరో చెప్పాలి. ఎవడా టీడీపీ లం... కొడుకు. సాక్షి యాజమాన్యంపై తిరుగుబాటు చేస్తా' అంటూ శివాలెత్తారు.

విషయం ఏందంటే..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తరఫున ప్రచారం చేసేందుకు ఆ పార్టీ అధిష్టానం పంపించిన రూ.కోటిలో చాలావరకు ఓ మాజీ ఎమ్మెల్యే తన వద్దే ఉంచేసుకున్నారని, దీంతో ఆ పార్టీ అధినేత సీరియస్ అయ్యారంటూ పెనుకొండ నియోజకవర్గంలో విస్తృత చర్చ జరిగింది. దీనిపై 'సాక్షి'లో ఈ నెల 15న కథనం ప్రచురితమైంది. దీన్ని జీర్ణించుకోలేని బీకే పార్థసారథి 'సాక్షి' విలేకరికి ఫోన్ చేసి రాయలేని భాషలో దూషించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఓడిపోతారనే భయంతో బీకే తనపై ఎలాంటి నింద రాకూడదనే ఉద్దేశంతో ముందస్తుగానే విలేకరిపై దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. ఒక విలేకరిని తిడితే ఇక ఏ ఒక్కరూ తనకు వ్యతిరేకంగా కథనాలు రాయరనే ఉద్దేశంతో పక్కా ప్రణాళికతోనే తిట్ల దండకం అందుకున్నట్లు తెలిసింది. ఇదిలావుండగా.. బీకే నుంచి తనకు ఎలాంటి సహకారమూ అందలేదని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి అధిష్టానం వద్ద వాపోయినట్లు సమాచారం. ఈ క్రమంలోనే చంద్రబాబు నుంచి బీకేకు ఫోన్ వచ్చినట్లు తెలిసింది.

ఉనికి కోసం తాపత్రయం

పెనుకొండ టీడీపీ టికెట్ ఈ సారి బీకే పార్థసారథికి రాదనే ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు అదే సామాజిక వర్గానికి (కురుబ) చెందిన సవితమ్మ టికెట్ రేసులో ఉన్నారు. చేనేత వర్గానికి చెందిన మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప కూడా టికెట్ కోసం తీవ్రంగానే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉనికి కాపాడుకునేందుకు బీకే పార్థసారథి తాపత్రయపడుతున్నట్లు స్పష్టమవుతోంది.

ఉపాధ్యాయుల పనితీరుపై ఎంఈఓల విచారణ

తనకల్లు: మండలంలోని నల్లగుట్లపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుల పనితీరుపై కదిరి ఎంఈఓ చెన్నకృష్ణతో కలసి తనకల్లు మండలం ఎంఈఓ లలితమ్మ విచారణ జరిపారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటనకు సంబంధించి వివరాలు... పాఠశాలలో పనిచేస్తున్న మరికొందరు ఉపాధ్యాయులు పాఠాలు చెప్పకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థినులు లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఎంఈఓలు విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్లు సమాచారం.

పీఈటీ నాగరాజు ఆకస్మిక మృతి



నాగరాజు (ఫైల్)

మడకశిర: మండలంలోని వైబీహళ్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఈటీగా పనిచేస్తున్న నాగరాజు (48) బుధవారం వేకువజామున మడకశిరలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. గుడిబండ మండలం మందలపల్లికి చెందిన నాగరాజు మృతిపై వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం మందలపల్లిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడు....

పెనుకొండ రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లి నివాసి బోయ చిన్న ముత్యాలు (65) పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం గ్రామ శివారులోని ఓ తోటలో పశువులను మేపునకు తోలుకెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి విద్యుత్ తీగలపై పడ్డాడు. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను గోరంట్ల సీఐ సుబ్బరాయుడు వెల్లడించారు. బుధవారం ఉదయం గోరంట్ల మండలం కోరేవాండ్లపల్లి క్రాస్‌లో వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా ద్విచక్రవాహనంపై వచ్చిన గుమ్మయ్యగారిపల్లికి చెందిన రామాంజనేయులు నుంచి ఎనిమిది ఫుల్ బాటిళ్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే గుమ్మయ్యగారిపల్లి క్రాస్ వద్ద ద్విచక్రవాహనంలో 190 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తూ మరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, మందలపల్లి గ్రామంలో మునెప్ప ఇంటి ఆవరణలో దాచిన 40 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. మద్యం తరలించేందుకు వినియోగించిన రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

18న ఉగాది పురస్కారాల ప్రదానం

అనంతపురం కల్చరల్: ప్రకృతి ధర్మపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంపిక చేసిన 45 మంది ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు ధర్మపీఠం మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం వరకూ అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల వేదికగా జరిగే పురస్కారాల ప్రదానోత్సవానికి విశిష్ట అతిథులుగా ప్రముఖ కన్నడ నటుడు రాఘవేంద్ర రాజ్‌కుమార్, ప్రముఖ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

జీడీఎస్ ఉద్యోగుల సమ్మె వాయిదా

అనంతపురం సిటీ: తపాలా శాఖకు చెందిన జీడీఎస్ ఉద్యోగులు గురు, శుక్రవారాల్లో తలపెట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను వాయిదా వేసినట్లు ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ అనంతపురం డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధానమైన నాలుగు డిమాండ్ల సాధనకు అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో రెండ్రోజుల పాటు దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దీంతో దిగొచ్చిన తపాలా శాఖ డైరెక్టర్ జనరల్ నుంచి చర్చలకు పిలుపు వచ్చింది. ఈ నేపథ్యంలో సమ్మె నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

కొమ్మ విరిగి పడి వ్యక్తి మృతి

- టీడీపీ నేత స్వార్థానికి బలైన కూలీ
- అక్రమంగా చెట్ల నరికివేతకు పురమాయింపు

పుట్టపర్తి అర్బన్: టీడీపీ నేత స్వార్థానికి ఓ కూలీ బలయ్యాడు. పొట్ట కూటి కోసం చెట్టు కోస్తుండగా కొమ్మ విరిగి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పుట్టపర్తి మండలం గాజులపల్లికి చెందిన టీడీపీ నేత చంద్ర.. ఇటుకల బట్టీ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. పచ్చని చెట్లను నరికి బట్టీలో ఇటుకలు కాల్చేందుకు వినియోగించేవాడు. ఈ క్రమంలో తన పొలంలో ఉన్న పురాతన చింత మాన్లను కోయాలంటూ గోరంట్ల మండలం బూదిలికి చెందిన ముగ్గురు కూలీలను పురమాయించాడు. మూడు రోజులుగా కటింగ్ మిషన్లతో చింతమాన్లను కూలీలు కోసేస్తున్నారు. బుధవారం కొమ్మలు కోస్తుండగా కూలీ ఊటుకూరు రామచంద్ర (35) తలపై ఓ పెద్ద కొమ్మ పడింది. ఘటనతో తల ఓ వైపు నుజ్జునుజ్జు కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి భార్య సుజాత అక్కడకు చేరుకుని బోరున విలపించింది. కూలి పనికి వెళితే తప్ప పూట గడవని స్థితిలో ఉన్న తాము ఎలా జీవించాలంటూ రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కాగా, మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



భర్త మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య సుజాత

అనుమతి లేకుండా మాన్ల నరికివేత?

కాగా, చింతమాన్ల నరికివేతను టీడీపీ నేత చంద్ర అక్రమంగా చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై తహసీల్దార్ నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా... చింత మాన్ల నరికి వేతకు సంబంధించి చంద్ర తమను సంప్రదించగా.. పురాతన మాన్లు కావడంతో అటవీ శాఖ అనుమతి తప్పనిసరిగా పొందాల్సి ఉంటుందని సూచించినట్లు వివరించారు. ఇదే అంశంపై అటవీ శాఖ స్థానిక గార్డు శిరీష మాట్లాడుతూ.. శాఖా పరమైన అనుమతులు ఏవీ లేకుండా మాన్లు నరికివేత చేపట్టినట్లుగా తెలిసిందన్నారు. కాగా, కూలీ రామచంద్ర మృతి విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అప్పటికే ఈ విషయం తెలుసుకున్న చంద్ర అజ్ఞాతంలోకి వెళ్లాడు. అతని కోసం గాలింపు కొనసాగుతోందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

'మార్కెట్' ఆదాయ వ్యయాలపై ఆర్జేడీ సమీక్ష

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ఆదాయ, వ్యయాలపై ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రామాంజినేయులు బుధవారం సమీక్షించారు. అనంతపురంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీడీఎం లావణ్య, ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎన్ మూర్తి, మార్కెట్ యార్డు సెక్రటరీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. రెండు జిల్లాల పరిధిలో ఉన్న 17 మార్కెట్‌యార్డులకు గాను ఈ ఏడాది నిర్ధేశించిన ఫీజు వసూళ్లు, సాధించిన ప్రగతిపై తొలుత ఆర్జేడీ ఆరా తీశారు. గత రెండు, మూడేళ్లతో పోల్చుకుంటే ఈ సారి పరిస్థితి ఆశాజనకంగా ఉండడంతో సిబ్బందిని అభినందించారు. అనంతపురం జిల్లాలో నాలుగు కమిటీలు, శ్రీసత్యసాయి జిల్లాలో మూడు కమిటీలు మాత్రమే ఫీజు వసూళ్లలో వెనుకబడి ఉన్నాయని, ఓవరాల్‌గా 95 శాతానికి పైగా లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. అనంతరం ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వాటికి అయ్యే ఖర్చులు, రాబడి, వివిధ రూపాల్లో పన్నుల వసూళ్లకు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. యార్డులు, చెక్‌పోస్టులను బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను ఆర్జేడీ వివరించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.10.81 కోట్ల వసూలు లక్ష్యంగా పనిచేయాలని అనంతపురం జిల్లా అధికారులను ఆదేశించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో ప్రస్తుత వసూళ్ల లక్ష్యం రూ.5.24 కోట్లు కాగా, దానిని రూ.4.91 కోట్లకు తగ్గించినట్లు తెలిపారు. మొత్తమ్మీద వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.15.72 కోట్ల వసూళ్ల లక్ష్యంగా పని చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

వృద్ధురాలి దుర్మరణం

గుత్తి రూరల్: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రంగాపురానికి చెందిన మద్దక్క (60) కొన్నేళ్లుగా గుత్తి మండలం కరిడికొండలో తన కుమార్తె లలిత వద్ద ఉంటోంది. మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వచ్చిన ఆమె ప్యాపిలి వైపుగా నడుచుకుంటూ వెళుతుండగా 44వ జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. నడిరోడ్డుపై పడిపోయిన మద్దక్క మృతదేహం మీదుగా పలు వాహనాలు వెళ్లడంతో ఆనవాలు చిక్కనంతగా ఛిద్రమైంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లాడు. బుధవారం ఉదయం స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న లలిత.. మృతురాలు ధరించిన చీర, ఇతర ఆనవాళ్లను బట్టి తన తల్లి మద్దక్కగా గుర్తించింది. ఘటన స్థలాన్ని ఎస్‌ఐ శ్రీనివాసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

లక్ష దాటిన 'గాలికుంటు' టీకాలు

పుట్టపర్తి అర్బన్: పాడి పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్ పేర్కొన్నారు. జిల్లాలోని 68 పశువైద్యశాలలు, 23 గ్రామీణ పశువైద్యశాలల పరిధిలో ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకూ 1,04,060 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకూ 62 వేల టీకాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, మిగిలిన వాటిని కూడా వెంటనే ఆన్‌లైన్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

క్లినిక్‌ల వివరాలు నమోదు చేయించుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రైవేట్ వైద్యశాలలు, లాబొరేటరీలు, పాలీ, డెంటల్ క్లినిక్‌లు, ఫిజియోథెరపి క్లినిక్‌ల నిర్వహణకు సంబంధించి తప్పనిసరిగా ఏపీ వైద్య, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం పరిధిలో నమోదు చేయాలని నిర్వాహకులకు అనంతపురం జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి సూచించారు. ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు.

నీటి గుంతలో పడి చిన్నారి మృతి



మృతి చెందిన చందన్‌కుమార్

రాయదుర్గం టౌన్: ఆడుకుంటూ వెళ్లి నీటి గుంతలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రాయదుర్గంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీనివాసులు, శ్రీలక్ష్మి దంపతులకు చందన్‌కుమార్ (3)తో పాటు ఏడాది వయసున్న రోహిత్ ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని శ్రీనివాసులు పోషించుకుంటున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లో తల్లి పనిచేసుకుంటుండగా చందన్‌కుమార్ ఆరుబయట ఆడుకుంటూ తాగునీటి కొళాయి గుంతలో పడ్డాడు. గుంతలో నీరు నిండుగా ఉండడంతో నీట మునిగి ఊపిరి అందక మృతి చెందాడు. కాసేపటి తర్వాత తల్లి బయటకు వచ్చి చూడగా నీటి గుంతలో తేలియాడుతున్న కుమారుడి మృతదేహం కనిపించింది. బిడ్డను వెంటనే వెలికి కుటుంబ సభ్యులతో కలసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఘటనపై రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎస్కేయూ హెల్త్‌కేర్ సెంటర్‌లో ఈసీజీ పరికరం ఏర్పాటు

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లోని హెల్త్‌కేర్ సెంటర్‌లో ఈసీజీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. బుధవారం హెల్త్ సెంటర్‌లో ఈసీజీ సేవలను వర్సిటీ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులకు ఉపయోగపడేలా ఈ పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య, సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఆచార్య జీవన్‌కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ఈసీజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి

బెంగళూరులో జిల్లా వాసి మృతి

బనశంకరి: బెంగళూరులో చోటు చేసుకున్న ప్రమాదంలో అనంతపురం జిల్లాకు చెందిన ఓ విద్యార్థి మృతి చెందారు. ఈ ఘటన బెంగళూరు మడివాళ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్‌కు చెందిన కార్తీక్ (23) బీటెక్ పూర్తి చేసి బెంగళూరులోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ కోరమంగలలో సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో అదే హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ కళాశాలలో పీయూసీ చదువుతున్న ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన భగీరథరెడ్డి (17)తో స్నేహం ఏర్పడింది. మంగళవారం రాత్రి 10 గంటలకు కారులో కార్తీక్, భగీరథరెడ్డి కలిసి బయలుదేరారు. కారును కార్తీక్ వేగంగా నడుపుతూ సిల్క్‌బోర్డు సమీపంలోని నియంత్రణ కోల్పోయి డివైడరును జంప్ చేసి అటు వైపు లైన్‌లోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సును ఢీకొన్నాడు. ఘటనలో కారు నుజ్జునుజ్జైంది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించేలోపు ఇద్దరూ మృతిచెందారు. బస్సులోని కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.



మృతిచెందిన కార్తీక్ (ఫైల్)